సాక్షి సిద్దిపేట

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



గణేశ్ ప్రతిమతో చిన్నారి..

గజ్వేల్‌లో జరిగిన శోభాయాత్రలో మహిళలు





విద్యాధర్
గజ్వేల్-ప్రజ్ఞాపూర్
మున్సిపల్ కమిషనర్

సాక్షి ఫోన్ ఇన్

తేదీ: 29-09-2023
సమయం: శుక్రవారం ఉదయం
10 నుంచి 11 గంటల వరకు

అంశం:
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, దోమల వ్యాప్తి, వ్యాధుల తీవ్రత

కాల్ చేయాల్సిన నంబర్లు:
9010144459, 9866009677

చెత్త తొలగిస్తాం.. చైతన్యం తెస్తాం

'సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛతపై ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్యం చేశాం.. అయినప్పటికీ పట్టణ సరిహద్దుల్లో చెత్త వేస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది.. దీంతో దోమల వ్యాప్తి, తద్వారా రోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. సమస్యల కట్టడికి పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించాం.. అన్ని వార్డుల్లోనూ పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటాం..' అని సిద్దిపేట స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ కమిషనర్ సంపత్ కుమార్ అన్నారు.

- సిద్దిపేటజోన్/సిద్దిపేట కమాన్



ఫోన్ ఇన్‌లో.. మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్



సాక్షి ఫోన్ ఇన్

సిద్దిపేట పట్టణాన్ని మెరిపిస్తాం

- పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం
- దోమల నివారణే ముఖ్యం
- ప్రజల సహకారం అవసరం
- వార్డుల్లో పర్యవేక్షణ నిరంతరం
- మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన

బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన ఫోన్ ఇన్‌కు ఆయా వార్డుల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రధానంగా దోమల వ్యాప్తి నియంత్రణ, పారిశుద్ధ్య పనులు, అవసరమైన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, నూతన కాలనీల్లో వీధి దీపాల ఏర్పాటు తదితర అంశాలపై ప్రజలు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని ఆయా విభాగాల అధికారులు సత్వరం పరిష్కరించాలని కమిషనర్ ఆదేశాలు జారీచేశారు.

> ఇందిరానగర్ ప్రాంతంలో కుక్కల, దోమల బెడద పరిష్కరించండి. (అత్తు)
>
> కమిషనర్: సమస్యలు ఉన్న వార్డుల్లో ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటాం. దోమల నివారణకు, కుక్కల బెడద పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

ఆయా ప్రాంతాల్లో దోమలు విపరీతంగా ఉన్నాయి. నియంత్రణ చర్యలు చేపట్టాలి. (శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్)

కమిషనర్: దోమల నియంత్రణకు బల్దియా ఆధ్వర్యంలో పక్కా ప్రణాళికను చేపట్టాం. ఫాగింగ్, మురికి కాలువల్లో, నివాస గృహాల వద్ద స్ప్రే, నీటి గుంతల్లో యాంటీ లార్వాలో భాగంగా ఆయిల్ బాల్స్ వేస్తున్నాం. పకడ్బందీగా అమలు చేస్తాం.

రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. దీంతో సమీపంలో ఉండే ప్రజలకు ఇబ్బందిగా ఉంటోంది. (నాగరాజు, రహమాన్)

కమిషనర్: ఇప్పటికే బహిరంగంగా చెత్త వేయడం నిషేధం.. దీనిపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం, అవగాహన కల్పించాం. ఖాళీ స్థలాల్లో, పట్టణ సరిహద్దుల్లో చెత్త వేస్తున్నట్టు తెలిసింది, అలాంటి ప్రాంతాల్లో నిఘా పెడతాం. నైట్ పెట్రోలింగ్ సైతం నిర్వహించి జరిమానా విధిస్తాం. ప్రజల సహకారం కూడా అవసరం.

గుంతల్లో నీరు నిల్వ ఉంటోంది. దీంతో దోమలు పెరుగుతున్నాయి. సమస్యను పరిష్కరించండి. (శ్రీనివాస్, భారత్ నగర్)

కమిషనర్: పట్టణంలో గుంతల్లో నీరు నిల్వ ఉండే అన్ని ప్రాంతాల్లో యాంటీ లార్వా స్ప్రే చేయిస్తాం, సిబ్బందిని వార్డుకు పంపిస్తాం.

కోటి లింగాల ప్రాంతంలో ఫాగింగ్ ప్రక్రియ జరగడం లేదు. చర్యలు తీసుకోండి.(రాజు)

కమిషనర్: ప్రతి వార్డులో ఫాగింగ్ ప్రక్రియ జరగాలి. సమస్య ఉన్న ప్రాంతాల్లో పరిస్థితిని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం. 24 గంటల్లో మీ ప్రాంతంలో ఫాగింగ్ జరిగేలా చూస్తాం.

కాలనీలోని కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. (ఆనందం, ప్రియదర్శిని నగర్)

కమిషనర్: అన్ని వార్డుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. విలీన వార్డుల్లో, కొత్తగా వెలిసిన కాలనీ ప్రాంతాల్లో కొంత సమస్య ఉంది. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

ఇక్బాల్ మినార్‌సుడా పార్కులో ఉండే టీ బొమ్మ నీటిని ఎప్పటికప్పుడు మార్చండి. (మజర్)

కమిషనర్: నీటిని ఎప్పటికప్పుడు మార్చేలా చర్యలు తీసుకుంటాం.

హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్ పరిసరాల్లో మురికి కాలువల్లో చెత్త తొలగించాలి. (మార్కండేయులు)

కమిషనర్: మురికి కాలువల్లో ఉండే చెత్త, సిల్ట్ ఏరివేత ప్రక్రియ ముమ్మరంగా చేపడతాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

> డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది, కాలనీలో కొన్ని చోట్ల యూజీడి లీకేజీల వల్ల రోడ్డు మీద నీరు పారుతోంది. (అర్జున్, ప్రియదర్శిని కాలనీ)
>
> కమిషనర్: యూజీడి వ్యవస్థను ప్రతి ఇంటికి అనుసంధానం చేయడం జరిగింది. కొన్ని నివాసాలు అనుసంధానం చేయకపోవడం వల్ల మురికి నీరు రోడ్డు పైకి వచ్చినట్టు ఉంది, సమస్య గుర్తించి వెంటనే పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటాం.

ప్రజలు కూడా సహకారాన్ని అందించాలి. చెత్తను మురికి కాలువల్లో వేయవద్దు, చెత్త సేకరణ బండికి ఇవ్వాలి.

కొండ మల్లయ్య గార్డెన్ వెనుక భాగంలో చివరి నివాసానికి చెత్త బండి రావడం లేదు. (మల్లేశం)

కమిషనర్: మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు ఇస్తాం. ప్రతి ఇంటికి చెత్త సేకరణ వాహనం వెళ్లే విధంగా చర్యలు చేపడతాం. కొన్ని చోట్ల ఇరుకైన వీధి వల్ల కొంత సమస్య ఉంటుంది. దాని పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

దోమల నియంత్రణకు ఇంటింటికీ స్ప్రే చేయించాలి. (రవి, పాత బస్టాండ్)

కమిషనర్: దోమల నియంత్రణ చర్యలు పక్కా చేపడుతున్నాం. నివాస సమీపంలో దోమ నిల్వ ప్రాంతాల్లో స్ప్రే, ఫాగింగ్ జరిగేలా చూస్తాం.

> మైత్రి వనంలో రోడ్లను శుభ్రం చేయడం లేదు. దుమ్ము లేస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. (జీవన్ రెడ్డి)
>
> కమిషనర్: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య సిబ్బంది రెగ్యులర్‌గా రోడ్డు ఊడ్చేలా చర్యలు తీసుకుంటారు. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తాం.

బైబై.. గణేశా..

ప్రత్యేక పూజలందుకున్న బొజ్జగణపయ్యలు బుధవారం రాత్రి నిమజ్జనోత్సవానికి బయలుదేరాయి. వీధుల్లో, నివాసాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను అందంగా అలంకరించిన వాహనాలపై ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. ఆట, పాటలు, డప్పుల హోరు మధ్య, చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ కలిసి గణనాథులకు చెరువులు, కుంటలకు తరలించారు. పోయిరా గణపయ్యా అంటూ భారీ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువులో వినాయక విగ్రహం నిమజ్జనం



సిద్దిపేట పట్టణంలో గణేశ్ విగ్రహాన్ని తరలిస్తూ..

న్యూస్‌రీల్

మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు: హరీశ్‌రావు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని ముస్లింలకు మంత్రి హరీశ్‌రావు 'ఈద్ మిలాద్ ఉన్ నబీ' శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త జీవితం మానవాళికి ప్రేమ, సోదరభావం, ధర్మంపై స్ఫూర్తి కలిగిస్తోందన్నారు. తోటివారికి విశ్వాసం, నమ్మకం, సంరక్షణ, కరుణతో సేవ చేసినప్పుడే ప్రవక్త లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని సన్మార్గంలో నడుస్తూ ఆయన బోధనలను సార్థకం చేయాలని సూచించారు.

నేటి నుంచి సిటీ పోలీస్‌యాక్ట్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ శ్వేత తెలిపారు. వచ్చే నెల 5వ తేదీ వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహించరాదని సీపీ సూచించారు. సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కూడా వచ్చే నెల 5 వరకు కొనసాగుతాయని సీపీ పేర్కొన్నారు.

భగత్ సింగ్ చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, ఉపాధ్యాయులు

సిద్దిపేటరూరల్: భగత్‌సింగ్ చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చింతమడక హైస్కూల్లో 116వ భగత్ సింగ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ దేశ స్వతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ పాత్ర కీలకమని అన్నారు. దేశం కోసం తన జీవితాన్ని సైతం త్యాగం చేసిన భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపూర్ అభివృద్ధి భేష్

ఎన్ఐఆర్‌డీ శిక్షణ బృందం కితాబు



పాఠశాలను సందర్శించిన అధికారులు

సిద్దిపేటరూరల్: ఇబ్రహీంపూర్ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, స్వచ్ఛత కార్యక్రమాలు భేష్‌గా ఉన్నాయని ఎన్ఐఆర్‌డీలో శిక్షణ బృందం సభ్యులు అన్నారు. గురువారం నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్ గ్రామాన్ని ఎన్ఐఆర్‌డీలో శిక్షణ పొందుతున్న పలు రాష్ట్రాలకు చెందిన 20 మంది అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని ఇంకుడుగుంతలు, శ్మశానవాటిక, సామూహిక గొర్రెలషెడ్లు, డంప్‌షెడ్‌లు, రిచార్జ్‌పిట్‌లు, సోలార్‌విద్యుత్, డబుల్‌బెడ్రూం ఇళ్లు, ప్రకృతి వనాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం అంతటా ఎంతో స్వచ్ఛంగా ఉందని, ఉపాధి హామీ ద్వారా పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవడం ఎంతో బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ అనురాధ, రాజ్‌కుమార్, ఎంపీడీఓ మురళీధర్‌శర్మ, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా కృషి చేస్తే విజయం మనదే

బీజేపీ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి



బీజేపీ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సమష్టిగా కృషి చేస్తే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని పార్టీ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డితో కలిసి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఒక కుటుంబం చేతిలో బందీ అయ్యిందన్నారు. రాష్ట్రంలో బీజేపీకి మంచి రోజులు రాబోతున్నాయన్నారు. సిద్దిపేటలో బీజేపీ జెండా ఎగురవేసేందుకు పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. దేశ వ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ హవా కొనసాగుతోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలన్నారు. అనంతరం జిల్లా కోర్ కమిటీ సమావేశం దూది శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో విద్యాసాగర్, బాలేష్, రామచంద్ర రెడ్డి, రామచంద్ర రావు, వెంకటరమణ, మల్లేశం, ఉపేందర్‌రావ్, సురేష్, నరేష్, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆదర్శనీయుడు

ప్రముఖ కవి, సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ



అశోక్‌తేజకు జ్ఞాపికను అందజేస్తున్న యూనివర్సిటీ అధికారులు

ములుగు(గజ్వేల్): అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించిన నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని ప్రముఖ కవి, సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వ విద్యాలయంలో బుధవారం నిర్వహించిన బాపూజీ జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ నీరజ ప్రభాకర్, ఐఎస్ఆర్ఓ. రిటైర్డ్ సైంటిస్ట్ రవికుమార్, యూనివర్సిటీ అధికారులతో కలసి అశోక్‌తేజ లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధనలో బాపూజీ పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. ఏదైనా గొప్ప సంకల్పంతో ముందుకు సాగితే లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. బుర్రతో ఆలోచన చేయనివారే నిజమైన పేద అని, డబ్బు లేకుంటే పేదరికం కాదని అశోక్‌తేజ వివరించారు. ఒక పేపరు బాయిగా అబ్దుల్ కలాం ఏస్థాయికి ఎదిగారో మనం ఆదర్శంగా తీసుకుని లక్ష సాధనవైపు సాగాలన్నారు. ఈ సందర్భంగా పలు సందేశాత్మక పాటలతో విద్యార్థులను ఉత్తేజపరిచారు. యూనివర్సిటీ అధికారులు అశోక్‌తేజను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు భగవాన్, కిరణ్‌కుమార్, విజయ, నటరాజన్ శ్రీనివాసన్, నాగేశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కులు కాపాడుకుందాం

ప్రియాంక వర్గీస్

ములుగు(గజ్వేల్): భవిష్యత్తులో ప్రతి అంశంలో మేధో సంపత్తి హక్కుల ప్రమేయం ఉంటుందని, ఆ హక్కులను కాపాడుకోవాలని ములుగు అటవీ కళాశాల పరిశోధన కేంద్రం డీన్ ప్రియాంక వర్గీస్ అన్నారు. అటవీ కళాశాల ఆడిటోరియంలో మేధో సంపత్తి హక్కులపై బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మేధో సంపత్తి హక్కులకు చాలా ప్రాధాన్యం ఉన్నదని చెప్పారు. కార్యక్రమంలో సెమినార్ సమన్వయ కర్త, ప్రొఫెసర్ ఎం.మమత, అధికారులు సుబాయిజిత్ సాహా, డాక్టర్. రాధిక, విద్యావేత్తలు, విద్యార్థులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ప్రియాంకవర్గీస్

మురిసిన చంద్లాపూర్



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న చంద్లాపూర్ సర్పంచ్ చంద్రకళ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఢిల్లీలో అవార్డు అందుకున్న గ్రామ సర్పంచ్

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామం దేశంలోనే అత్యుత్తమ పర్యాటక ప్రాంతంగా అరుదైన ఘనత సాధించింది. ఈ మేరకు దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సూరగోని చంద్రకళ రవి, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డిలు కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ అజయ్ భట్ నుంచి అవార్డు అందుకున్నారు. గ్రామం వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని, ప్రాంత ప్రత్యేకతను పరిగణనలోకి తీసుకుని అవార్డుకు ఎంపిక చేశారు. 4,500 జనాభా ఉన్న ఈ గ్రామంలో రంగనాయకస్వామి ఆలయం ప్రత్యేకం. అలాగే రంగనాయక సాగర్ రిజర్వాయర్ గ్రామానికి మణిహారంగా మారింది. సాంస్కృతిక, పర్యాటక రంగాలలో అభివృద్ధి సాధిస్తూ ప్రణాళిక బద్ధంగా చేపట్టిన కార్యక్రమాలతో సాధించిన ప్రగతి నేడు గ్రామాన్ని జాతీయ స్థాయిలో నిలపింది.

> **ప్రజలకు దక్కిన గౌరవం..**
>
> సిద్దిపేటకు గోదావరి జలాల తరలింపు.. అందుకు ప్రతిఫలం దక్కడం ఒక చరిత్ర. చంద్లాపూర్ నేడు టూరిజం విలేజీగా జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ప్రజలకు, రిజర్వాయర్ కోసం భూమి త్యాగం చేసిన వారికి దక్కిన గౌరవమన్నారు. ఢిల్లీలో అవార్డు అందుకున్న గ్రామ సర్పంచ్ చంద్రకళకు శుభాకాంక్షలు.
>
> –హరీశ్‌రావు, మంత్రి

నిధులు వేగిరం.. పనులు ముమ్మరం

- కొత్త ప్రతిపాదనలకు ఆమోదం
- పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి
- ఎన్నికలు సమీపిస్తున్న వేళ అంతా సందడి
- గజ్వేల్‌లో సీఎం పర్యటించే అవకాశం



గజ్వేల్‌లో అధునాతన హంగులతో నిర్మించిన బస్టాండ్

గజ్వేల్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. పెండింగ్ పనులను పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అలాగే అత్యవసరమైన కొత్త ప్రతిపాదనలకు ఆమోదం తెలిపి పనులను ప్రారంభించే దిశగా చర్యలు చేపడుతున్నారు. మరోవైపు గజ్వేల్ నియోజకవర్గంలో సీఎం త్వరలో పర్యటించనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో సిద్దిపేట జిల్లాది ప్రత్యేక స్థానం. సీఎం కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గం నుంచి, మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట నుంచి ప్రాతినిధ్యం వహించడమే ఇందుకు కారణం. జిల్లాలో ఒక్కసారిగా హడావిడి వాతావరణం నెలకొంది. నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ చొరవ ఫలితంగా భారీగా అభివృద్ధి పనులు సాగాయి. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే కొన్ని పనులు పూర్తి కావస్తుండగా.. మరి కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. రూ.27.35కోట్ల వ్యయంతో నిర్మించిన మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిని పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. అంతేకాకుండా పట్టణంలో తూప్రాన్ రోడ్డువైపు రూ.10కోట్ల వ్యయంతో నిర్మించిన అధునాతన బస్టాండ్‌ను సైతం ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. రూ.240కోట్లతో చేపట్టిన రింగురోడ్డు పనులు పూర్తికావొచ్చాయి. ఈ మూడు భారీ అభివృద్ధి ప్రాజెక్టులను సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసి, ఇక్కడ భారీ సభను నిర్వహించడం ద్వారా ఎన్నికల శంఖారావం పూరించడానికి ముందుకుసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశం కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం తరహాలో సాగనుందని చెప్పుకుంటున్నారు. అంతేకాకుండా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సీసీ రోడ్లకు అదనపు నిధులు, నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న భవనాలకు సైతం నిధులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఇక్కడి మున్సిపల్ పాలకవర్గం మంత్రి హరీశ్‌రావుకు ఇప్పటికే వినతి పత్రాన్ని అందజేసింది. గజ్వేల్‌తోపాటు సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాల పరిధిలో పెండింగ్ పనులను పూర్తి చేయడం, అత్యవసరమైన కొత్త పనులకు ఆమోదం పలికే అంశంపై మంత్రి హరీశ్‌రావు ప్రత్యేకంగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీటితోపాటుగా బీసీ బంధు, మైనార్టీలకు ఆర్థికసాయం, గృహలక్ష్మీ ప్రొసీడింగ్‌ల పంపిణీపైనా దృష్టి సారించారు. వివాదాల కారణంగా కొన్ని చోట్ల దళిత బంధు అమలుకు తాత్కాలికంగా బ్రేక్ వేశారు. మొత్తానికి జిల్లాలో కొన్ని రోజులుగా సందడి వాతావరణం కనిపిస్తున్నది.

క్లుప్తంగా

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

రాయికోడ్(అందోల్): మండలంలోని పీపడ్పల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది సంగారెడ్డి, వీరప్ప, రవిలతో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశామన్నారు. గ్రామానికి చెందిన ఆరుగురు పేకాట ఆడుతుండగా పట్టుకుని రూ.30,200ల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం జహీరాబాద్ కోర్టుకు తరలించామన్నారు.

వైన్స్‌లో మద్యం బాటిళ్ల చోరీ



వైన్స్‌లో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): మండల పరిధిలోని కాళ్లకల్ -2 వైన్స్‌లో చోరీ జరిగింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వైన్స్ షట్టర్‌కు నిర్వాహకులు ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తాళం వేసి వెళ్లారు. బుధవారం వచ్చి చూసేసరికి షట్టర్ సగం తెరిచి ఉంది. దీంతో వైన్స్ యజమాని సార సంతోష్‌గౌడ్ మనోహరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి విచారణ చేశారు. వైన్స్‌లో మద్యం బాటిళ్లు మాయమైనట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నవోదయ వెయిటింగ్ లిస్టు విడుదల

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి మెదక్‌జిల్లా వర్గల్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశం కోసం 21 మంది విద్యార్థుల వెయిటింగ్ లిస్టు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ డి.రాజేందర్ వెల్లడించారు. ఇతర వివరాల కోసం అభ్యర్థులు సెల్‌ఫోన్ నెంబర్ 9921555310లో సంప్రదించాలని సూచించారు.

వెయిటింగ్ లిస్టు అభ్యర్థుల పేర్లు: శెనిశెట్టి సుప్రతీక్(ఏ3435907), గోపులారం సాయి యశస్వి(ఏ3437126), పన్యాల శ్రేహిత్ రెడ్డి(ఏ3437746), కేశవ్ నాయక్(ఏ 3438225), తాళ్ల అమూల్య(ఎఫ్3433711), కూర్మాచలం శ్రీచరణ్(బీ3434317), గాజుల శ్రీహిత(ఎఫ్3434410), బీ బ్లెస్సీ(జీ 3434566), బిట్ల ప్రేరణ(జీ3434785), మునిగల సాయికీర్తిక(ఎస్3435869), బొల్లి వివేక్ అభి(జే3435905), కొల్కూరి శ్రవణ్‌కుమార్(జే3436312), దమ్మన్నగారి సృతిక(ఎం3437348), దొడ్ల శుభాకర్(జే3434790), పట్నం అభిజ్ఞ(ఎస్3434815), మాటూరి లక్ష్మీప్రసన్న(ఎస్3435366), గుండారం జాన్‌మైఖేల్(కే3434721), తోష కమలాకర్(కే3434848), మైసని రాకేశ్(కే3436272), కండెల హర్షవర్ధన్(ఎల్3 434574), వడిత్య విజయ(పీ3435381).

జాతీయ పోటీలకు సిద్దిపేట విద్యార్థి



పూజితను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఫిజికల్ డైరెక్టర్

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల విద్యార్థిని జాతీయ స్థాయి యోగాసన పోటీలకు ఎంపికైంది. బుధవారం కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్, ఇంచార్జి ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.విశ్వనాథ్‌లు ఆమెను సన్మానించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కళాశాలకు చెందిన ఎంపీసీఎస్ ఫైనలియర్ విద్యార్థిని పూజిత యోగాసన, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో జరిగిన పోటీల్లో రిథమిక్, ఆర్టిస్టిక్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. గతంలో ఆరు సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నదని తెలిపారు. ఈ సారి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్, అధ్యాపకులు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ గోపాల సుదర్శనం ఉన్నారు.

సైకిల్ సవారీ

- సైక్లింగ్‌కు మొగ్గు చూపుతున్న యువత
- హెల్త్ క్లబ్‌ల ద్వారా సైకిళ్లు పంపిణీ
- ట్రాక్‌ను అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం

ఒకప్పుడు ప్రతి ఇంటిలో సైకిల్ ఉండేది. ఎక్కడికి వెళ్లాలన్నా దాని మీదే వెళ్లేవారు. ఆధునిక బైకులు, కార్ల రాకతో సైకిళ్ల వాడకం తగ్గిపోయింది. ఎవరైనా సైకిల్ తొక్కుతూ రోడ్డు మీద కనిపిస్తే ఎగతాళి చేసేవారు. అలాంటిది ఆరోగ్య ప్రయోజనం కోసం యువత మళ్లీ సైకిల్‌పై సవారీ చేస్తున్నారు.



సైకిళ్లతో తెల్లాపూర్ స్ఫూర్తి హెల్త్ క్లబ్ సభ్యులు (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నేటి యువత ఒత్తిడికి దూరంగా ఉండేందుకు అనేక మార్గాలను వెతుక్కుంటున్నారు. నిత్యం పని ఒత్తిడి, పోటీ ప్రపంచంలో ఉదయం నుంచి రాత్రి వరకు మనిషి యాంత్రిక జీవితాన్ని గడుపుతున్నాడు. దాంతో ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కొంతమంది జిమ్‌లకు వెళ్తుండగా, మరి కొందరు సైకిల్ తొక్కడానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో అనేక సైకిల్ క్లబ్‌లను ఏర్పాటు చేసి సైకిల్ తొక్కేవారిని ప్రోత్సహిస్తున్నారు. ఆరోగ్యం కోసం చిన్నారుల నుంచి వృద్ధుల వరకు సైక్లింగ్ పై ఆసక్తిని పెంచుకుంటున్నారు. పూర్వకాలంలో లాగా సమయం దొరికిందంటే సైకిల్ తొక్కుతున్నారు.

బీహెచ్ఈఎల్ కాలనీలో విశాలమైన రోడ్లు, మంచి వాతావరణం ఉండడంతో ఉదయం సాయంత్రం వేళల్లో ఐటీ ఉద్యోగులు, యువత సైకిల్ పై చక్కర్లు కొడుతున్నారు. అదేవిధంగా గతంలో హైదరాబాద్ నగరానికి చెందిన సైక్లింగ్ క్లబ్బులు సైతం రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి సైకిళ్ల కోసం ప్రత్యేక ట్రాకులను అభివృద్ధి చేయాలని కోరారు. దాంతో ప్రభుత్వం స్పందించి కోట్లాది రూపాయలు వెచ్చించి రింగ్ రోడ్డు ఆనుకొని ఓ సైక్లింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేసింది. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు రింగ్ రోడ్డు నుంచి కోకాపేట్ వరకు సైకిల్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీసీ కెమెరాలు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇది త్వరలో అందుబాటులోకి రానుంది. కాగా నేడు మార్కెట్లో సైతం వివిధ రకాల సైకిళ్లు అందుబాటులోకి వచ్చాయి. కొందరు విదేశాల నుంచి సైతం సైకిళ్లను తెప్పించుకుంటున్నారు. అయితే సైక్లింగ్‌తో ఆరోగ్యం పొందాలనుకునేవారు నిత్యం సుమారు 10 కిలోమీటర్ల నుంచి 40 కిలోమీటర్లు సైకిళ్లు తొక్కుతున్నారు.

ప్రోత్సహిస్తున్న సైక్లింగ్ క్లబ్‌లు

ఆరోగ్యమే మహాభాగ్యమంటూ పలు సైక్లింగ్ క్లబ్‌లు యువతను ప్రోత్సహిస్తుంది. సైకిల్ తొక్కడంపై ఆసక్తి పెంచేందుకు కృషి చేస్తున్నాయి. గతంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్ఫూర్తి హెల్త్ క్లబ్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా సైక్లింగ్ పై అవగాహన కల్పించి సుమారు 200 మంది సభ్యులకు సైకిళ్లు పంపిణీ చేశారు. వీరంతా నిత్యం 15 కిలోమీటర్లు సైకిల్ తొక్కేవారు. అదే సమయంలో తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి సైతం అనేకమందికి సైకిల్ ఇప్పించి ప్రోత్సహించారు.



కొల్లూరులో రింగ్ రోడ్డును ఆనుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సైకిల్ ట్రాక్

సైక్లింగ్ నా ప్రాణం



నాకు సైక్లింగ్ అంటే ప్రాణం. నిత్యం 40కిలోమీటర్లు సైకిల్ తొక్కుతా. గతంలో పారిస్ నుంచి బ్రెస్ట్ వరకు 1200 కిలోమీటర్లు 90 గంటల్లో సైక్లింగ్ పూర్తి చేశా. సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంతో పాటు రోజంతా చురుగ్గా ఉంటాం.

– ప్రశాంత్, ఐటీ ఉద్యోగి

ఆరోగ్యంగా ఉంటాం



సైక్లింగ్ చేయడం వలన ఎంతో ఆరోగ్యంగా ఉంటాం. దానిని దృష్టిలో పెట్టుకొని రోజు ఎంత బిజీగా ఉన్నా ఉదయం, సాయంత్రం సమయంలో తప్పనిసరిగా 20 కిలోమీటర్లు సైకిల్ ప్రయాణం చేస్తా.

– అరవ రామకృష్ణ, వ్యాపారవేత్త

సైకిల్‌పైనే వెళ్తుంటా



నా వయసు 83 సంవత్సరాలు. ఇప్పటికీ రోజూ ఎక్కడికి వెళ్లాన్నా సైకిల్ మీదనే పోతుంట. రోజు సైకిల్ తొక్కడం వలన ఆరోగ్యంగా ఉంటాం. చిన్నప్పటి నుంచి నాకు సైకిల్ తొక్కడం అంటే ఇష్టం.

–నాగేశ్వరరావు, తెల్లాపూర్

ట్రాక్‌లను అభివృద్ధి చేయాలి



2016లో స్ఫూర్తి హెల్త్ క్లబ్‌ను ఏర్పాటు చేసి సైక్లింగ్‌పై అవగాహన కల్పించాం. రింగ్ రోడ్డు పక్కన సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. మిగతా చోట్ల కూడా అభివృద్ధి చేయాలి.

– చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి, స్ఫూర్తి హెల్త్ క్లబ్ వ్యవస్థాపకులు

పట్టపగలే ఇంట్లో చోరీ

పాపన్నపేట(మెదక్): కుర్తివాడ గ్రామంలో దొంగలు చెలరేగిపోతున్నారు. ఇటీవల ఓ మహిళ మెడలో నుండి పుస్తెల తాడు ఎత్తుకెళ్లిన సంఘటన మరువక ముందే బుధవారం పట్టపగలే ఓ ఇంట్లో దొంగలు పడి ఆభరణాలు చోరీ చేశారు. బాధితులు తెలిపిన వివరాలు. ఇలా ఉన్నాయి. కుర్తివాడకు చెందిన పట్లోల్ల నాగరాజు డ్యూటీకి వెళ్లగా, ఆయన భార్య వసంత ఇంటికి గొళ్లెం పెట్టి.. పక్కింట్లో జరుగుతున్న విందుకు వెళ్లింది. ఈ సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి లోపల నుంచి గడియ పెట్టుకున్నారు. విందు ముగించుకొని వసంత ఇంటికి రాగా, తలుపు లోపలి నుంచి గడియ పెట్టినట్లు గుర్తించి చుట్టు పక్కల వారిని పిలిచింది. లోపల ఉన్న వారు ఒక్కసారిగా బయటకు వచ్చి బైక్‌పై ఉడాయించారు. వసంత ఇంట్లోకి వెళ్లి చూసే సరికి 4 తులాల బంగారు గొలుసు, మాటీలు చోరీకి గురైనట్లు గుర్తించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేశారు.

తూము మరమ్మతు చేసేందుకు వెళ్లి..

నీటమునిగి వీఆర్ఏ మృతి



నర్సింలు(ఫైల్)

హవేళీఘణాపూర్(మెదక్): చెరువు నీటిలో మునిగి వీఆర్ఏ మృతి చెందిన సంఘటన మెదక్ మండలం ముక్తభూపతిపూర గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వీఆర్ఏ ముష్టి నర్సింలు(60) బుధవారం ఉదయం గ్రామ శివారులోని ఊర చెరువులో నీరు వృథాగా పోతుందని తెలిసి తూము మరమ్మతు చేసేందుకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. నర్సింలు బట్టలు, చెప్పులు కట్టపై ఉన్న విషయాన్ని గమనించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. తూములో వెతకగా శవం లభ్యమైంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమర్ తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం నాయక్



మాట్లాడుతున్న పురుషోత్తం నాయక్

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని హైదరాబాద్ జోన్ (మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్ ఉమ్మడి జిల్లాల)ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం నాయక్ అన్నారు. సిద్దిపేట, దుబ్బాక ఆర్టీసీ డిపోలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 46మంది సిబ్బందికి సిద్దిపేట డిపోలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రగతి చక్రం అవార్డులు ప్రదానం చేసి, ప్రశంసాపత్రాలతో అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పురుషోత్తం నాయక్ మాట్లాడారు. డిపోలోని ప్రతి ఒక్క ఉద్యోగి ఉత్తమ ఉద్యోగి కావాలని, అందరూ అవార్డులు తీసుకోవాలన్నారు. సిద్దిపేట నుంచి తిరుపతి, షోలాపూర్, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నారన్నారు. సిద్దిపేట డిపోకు ప్రతి సంవత్సరం రూ.20కోట్ల ఆదాయం వచ్చే వనరులు ఉన్నాయన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. తార్నాకలోని ఆస్పత్రిలో కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందుతున్నాయన్నారు. హెల్త్ చాలెంజ్‌లో 5వేల మంది ఉద్యోగులను ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని రిఫరల్ చేసి వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ సిబ్బందికి స్కిల్ డెవలప్‌మెంట్ కోసం రూ.6కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. ఈ మేరకు సిద్దిపేట డిపో నుంచి రూ.8కోట్ల ఆదాయం వచ్చేలా పనిచేస్తామని సిబ్బంది హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎం ప్రభులత, డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి, డీఆర్ఎంలు జోత్స్న, డైవాదీనం, అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరి, మౌలానా, అస్లామ్, రవిందర్, నాయిని నారాయణరెడ్డి, ఎస్ఎస్ రెడ్డి, భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురు ఆత్మహత్య

అప్పుల బాధతో....



భాస్కర్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి పిల్లుట్ల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన భాస్కర్(36) ఆటో నడుపుతుంటాడు. ఆటో కొనుగోలుకు, కుటుంబ అవసరాల నిమిత్తం రూ.3 లక్షల వరకు అప్పు చేశాడు. అవి తీర్చడానికి ఆటో అమ్మి ఓ పరిశ్రమలో పనికి కుదిరాడు. అయినా అప్పులు తీరలేదు. దీంతో మనోవేదనకు గురై ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా బుధవారం తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య రాధిక, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ సంఘటన పై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రవికాంత్‌రావ్ తెలిపారు.

ఆరోగ్య, ఆర్థిక సమస్యలతో..



యాదగిరి(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): ఆరోగ్య సమస్యతో పాటు ఆర్థిక ఇబ్బందులు వెంటాడటంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణ తెలిపిన వివరాలు. మండలంలోని చందంపేట గ్రామానికి చెందిన గంట యాదగిరి(56) మూడేళ్ల క్రితం అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందడంతో రూ.5 లక్షలు ఖర్చు అయింది. ఆర్థిక భారం, అనారోగ్యంతో బాధపడుతూ మానసిక వేదనకు గురైన యాదగిరి బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో..

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాలలో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన శేరి కుమార్ (28)కు అల్వాల గ్రామానికి చెందిన పావనితో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పాప, బాబు ఉన్నారు. కుమార్ వ్యవసాయం చేస్తుంటాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు మొదలయ్యాయి. దీంతో భార్య పుట్టింటికి వెళ్లింది. మనస్తాపానికి గురైన కుమార్ అల్వాల గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి కనకవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


పురుగు మందు తాగి..



కరుణాకర్ (ఫైల్)

పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని అల్వాలలో జరిగింది. మిరుదొడ్డి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొమ్మ లింగం, లక్ష్మిల కుమారుడు కరుణాకర్ (30) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో కలత చెందిన కరుణాకర్ బుధవారం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని భార్య వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఉరివేసుకుని..



హరీశ్‌శర్మ (ఫైల్)

తూప్రాన్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణ కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన తావోజీ హరీశ్‌శర్మ(38) భార్య రేణుక ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల కారణంగా పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన హరీశ్‌శర్మ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సంక్షేమానికి పథకాలు

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్ : మహిళల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తిరుమల గార్డెన్‌లో జరిగిన స్వయం సహాయక మహిళా సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 1470 మంది యువతీ యువకులకు సొంత ఖర్చులతో డ్రైవింగ్ లైసెన్స్‌లు అందించారు. అలాగే మైనార్టీలకు ప్రభుత్వం మంజూరి చేసిన లక్ష రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న సమీకృత కార్యాలయ భవన నిర్మాణ పనులను ఎంపీ పరిశీలించారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు ఖలీల్ తదితరులు ఉన్నారు.

పొగమంచులో దారి కనిపించక..

కారు, బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



ధ్వంసమైన కారు, బైక్

చిన్నశంకరంపేట(మెదక్): దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో దారి కనిపించక ఎదురెదురుగా కారు, బైక్ ఢీకొన్న సంఘటన చిన్నశంకరంపేట మండలం అంబాజిపేట గ్రామంలో చోటుచేసుకుంది. బుధవారం రోడ్డుపై దట్టంగా మంచు పరుచుకోవడంతో మెదక్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారును బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న అంబాజిపేట గ్రామానికి చెందిన చాకలి మధుకు తీవ్రగాయాలు అయ్యాయి. అతన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాద ంలో కారు ముందు భాగం నుజ్జయింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను రోడ్డుపై నుంచి పక్కకు జరిపించారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



రాగి పెంటయ్య (ఫైల్)

కొడిపల్లి(నర్సాపూర్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధి రాయిలాపూర్ గేట్ సమీపంలో 765డి జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రాగి పెంటయ్య(42) వ్యవసాయంతో పాటు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. బుధవారం సాయంత్రం టీవీఎస్ మోపెడ్‌పై వెంకట్రావ్ పేటగేట్ వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా రాయిలాపూర్‌గేట్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో బాధితుడిని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ విఠల్ తెలిపారు. మృతునికి భార్య మనోహర, కూతురు నందిని ఉన్నారు.

బైక్‌ను కారు ఢీకొనడంతో..



రవి(ఫైల్)

రామాయంపేట(మెదక్): బైక్‌ను కారు ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం మండలంలోని తొనిగండ్ల శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తొనిగండ్ల గ్రామానికి చెందిన డీసు రవి(31) తల్లిదండ్రులతో కలిసి బైక్‌పై హవేళీఘనపూర్ మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో జరిగిన బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రవి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి భూషణం ఆరోగ్యం విషమంగా ఉండడంతో సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు.

సిద్దిపేటలో క్రీడా సంబురం

- ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు
- నాలుగు రోజుల పాటు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు



హుస్నాబాద్, వర్గల్ జట్ల మధ్య బాలుర ఖోఖో పోటీ

సిద్దిపేటజోన్: పట్టణంలో క్రీడా సంబరం నెలకొంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో నాలుగు రోజుల పాటు జిల్లాస్థాయి పోటీలు జరుగుతున్నాయి. జిల్లాలోని ఆయా పాఠశాలల విద్యార్థులు అండర్14, అండర్17 పేరిట వాలీబాల్, ఖోఖో, కబడ్డీ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆర్థిక, వైద్యారోగ్యా శాఖ మంత్రి హరీశ్‌రావు పోటీలు ప్రారంభించారు. మొత్తం 624 క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రధానంగా బాలుర, బాలికల విభాగంలో పోటీలు జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారు ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలోనూ పోటీలో పాల్గొనాల్సి ఉంటుంది. పోటీల నిర్వహణ ఎస్జీఎఫ్ ప్రతినిధులు, పీఈటీలు చూస్తున్నారు.

హోరాహోరీగా పోటీలు

బుధవారం బాలుర ఖోఖో పోటీలు హోరాహోరీగా సాగాయి. నాకౌట్ పద్ధతి లో పోటీలు జరుగుతున్న నేపథ్యంలో ఫైనల్ చేరేందుకు అన్ని జట్లు పోటీ పడుతున్నాయి. జిల్లా స్థాయి పోటీల్లో ఇటీవల రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఆడిన విద్యార్థులు కూడా పాల్గొంటున్నారు. క్రీడాకారులకు మంత్రి హరీశ్ రావు భోజన వసతులు ఏర్పాటు చేశారు. సౌకర్యాలను జిల్లా డీఎస్ఓ పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 29 వరకు పోటీలు జరగనున్నాయి.

జాతీయ స్థాయి లక్ష్యం



ఇప్పటికే ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయిలో అథ్లెటిక్స్ పోటీలకు హాజరయ్యా. ఖోఖో విభాగంలో జాతీయ స్థాయిలో ఆడాలని లక్ష్యం. అందుకే ఆ దిశగా ముందుకు సాగుతున్న.

– గణేష్, చిన్నకోడూర్ జెడ్పీ పాఠశాల

మళ్లీ ఈసారి కూడా..



ఇప్పటికే ఖోఖో విభాగంలో జాతీయ స్థాయిలో పాల్గొన్నాను. ఈ సారి కూడా మళ్లీ జాతీయ స్థాయిలో ఆడుతాననే నమ్మకం ఉంది. ఈసారి కూడా ముమ్మరంగా ప్రాక్టీస్ చేశా.

–ఆకాష్, వర్గల్

నమ్మకం ఉంది



జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అవుతాననే నమ్మకం ఉంది. తప్పులు చేయకుండా ఖోఖో ఆటలో ప్రతిభ చూపుతున్న.

– గోపాల్, వర్గల్

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న జడ్జి, ఏసీపీ

అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక

గజ్వేల్‌రూరల్: విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని గజ్వేల్ మున్సిఫ్ కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక పేర్కొన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో తెలంగాణ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి మెదక్ జిల్లా క్రీడా పోటీలు బుధవారం అట్టహాసంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి ప్రియాంక మాట్లాడారు. విజేతలకు గజ్వేల్ ఏసీపీ రమేష్‌తో కలిసి జడ్జి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గజ్వేల్ తహసీల్దార్ బాల్‌రాజు, ఎంఈవో సునీత, మెదక్ ఆర్ఎల్‌సీ నర్సింహ, విజిలెన్స్ అధికారులు గౌస్, ప్రభుచరణ్, డిప్యూటీ తహసీల్దార్ భవాని, సుధారాణి, శ్రీవాణి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.